**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**
**Telangana State Committee**
M.B.Bhavan, H. No.1-1-60/2, RTC 'X' Roads, Hyderabad -20.
Ph. 040- 27665011 /12, Fax : 27665013, Email-cpimtelangana@gmail.com

తేది: 28.07.2021

# దేశవ్యాప్తంగా వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలి

కేంద్ర బిజెపి సర్కార్ దేశవ్యాప్తంగా రైతాంగ రుణాలు మాఫీ చేసి రైతుకు రుణభారాన్ని లేకుండా చేసి వ్యవసాయ రంగాన్ని, రైతులను సంక్షోభం నుండి కాపాడాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది.

దేశవ్యాప్తంగా 15 కోట్ల కుటుంబాలు వ్యవసాయ రంగం మీద ఆధారపడి జీవిస్తున్నారు. వీరిలో 85% రైతాంగం సన్న, చిన్నకారు రైతులు, దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలకు చెందినవారు. ప్రతి రెండేళ్ళకోసారి కరువు, వరదలు, వడగల్లు, తుఫాన్‌ల వలన పంట నష్టపోతున్నారు. అప్పులు కట్టలేక రైతులు తమ భూములు అమ్ముకుని కూలీలుగా మారుతున్నారు. ఒకపక్క ఉత్పత్తి ఖర్చులు, డీజిల్, మిషనరీ ధరలు పెరిగి వ్యవసాయం గిట్టుబాటు కావడంలేదు. మరోపక్క మార్కెట్ దోపిడీకి గురై తీవ్రంగా నష్టపోతున్నారు. కౌలు రైతులకు ఇది మరింత భారంగా మారింది. రుణభారం రైతుకు ప్రధాన సమస్యగా ఉంది. ఈ స్థితిలో వ్యవసాయం తిరిగి పునరుద్ధరించాలంటే పంటరుణాలు మాఫీ చేయాలి.

దేశవ్యాప్తంగా ఈ రుణం 17 లక్షల కోట్లు ఉంటుందని పార్లమెంటు సాక్షిగా చెప్పారు. పెద్ద పెద్ద కార్పొరేట్లకు రాయితీలు ఇచ్చి రు.8 లక్షల కోట్లు పారుబకాయిలను కేంద్రప్రభుత్వం రద్దు చేసింది. కానీ కోవిడ్ సమయంలోనూ దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టిన రైతులను ఆదుకునేందుకు చేతులు రావడంలేదు. కరోనా కాలంలో దేశంలోని 100 మంది పారిశ్రామికవేత్తల సంపద రు 12,97,822 కోట్లు పెరిగింది. ఒక్క ముఖేష్ అంబానీ ఆస్తులే ఈ సంవత్సరం 73% పెరిగాయి.

కేంద్రం రైతుల పట్ల సవతి ప్రేమ చూపిస్తూ మూడు వ్యవసాయ చట్టాలు తెచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు దోచిపెట్టడానికి ప్రయత్నిస్తున్నది. మరోపక్క విద్యుత్ డిస్కామ్ ప్రైవేటీకరణ చట్టం తెచ్చి, వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌కు మంగళం పాడే ప్రయత్నం చేస్తున్నది. సహకార రంగాన్ని తన చేతిలోకి తీసుకుని ఆ రంగంలో ఉన్న లక్షల కోట్ల డిపాజిట్లపై పెత్తనం చేయాలని చూస్తున్నది. వ్యవసాయానికి అవసరమైన రుణం సంవత్సరానికి 15 లక్షల కోట్లు. కానీ కేంద్రం రుణ ప్రణాళికలో 8 లక్షల కోట్లు ప్రకటించి 5,6 లక్షల కోట్లు కూడా బ్యాంకులు ఇవ్వడం లేదు. అవసరమైన రుణం దొరకక రైతులు ప్రైవేటు అప్పులబారిన పడుతున్నారు.

వ్యవసాయ రుణమాఫీ మా విధానం కాదని కేంద్ర బిజెపి పార్టీ ప్రకటించింది. కానీ యుపి శాసనసభ ఎన్నికలలో రుణమాఫీ పథకాన్ని ప్రకటించి తమ ద్వంద నీతిని చాటుకున్నారు. సన్న, చిన్నకారు రైతులకు (10 ఎకరాలలోపు) వ్యవసాయరుణాలు మాఫీ చేసి వ్యవసాయరంగాన్ని ఆదుకోవాలని సిపిఐ(ఎం) కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నది. అన్ని రాష్ట్రాలు, రైతుసంఘాలు కూడా దీనిపై ఉద్యమించి రైతాంగాన్ని అప్పుల ఊబి నుండి కాపాడాలని కోరుతున్నది.

**(తమ్మినేని వీరభద్రం)**
**రాష్ట్ర కార్యదర్శి**